



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



'యువ వికాసం'పై ప్రచారం

చేపట్టాలి

» మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎక్కువ మంది నిరుద్యోగులు ఉపయోగించుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సెలవు రోజుల్లో కూడా ప్రజాపాలన కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జాగ్రత్తగా భద్రపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలుచోట్ల మైనార్టీ దరఖాస్తులు ఏమీ రానందున ఆ వర్గాలకు అవగాహన కల్పించేందుకు మత పెద్దలతో మసీదులలో, చర్చిలలో ప్రచారం చేయాలని సూచించారు. 25 శాతం సింగిల్ ఉమెన్, వితంతువులకు, 5 శాతం దివ్యాంగులకు కూడా ఈ పథకంలో అవకాశం కల్పించాల్సి ఉన్నందున వారు కూడా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

'సంవిధాన్'కు శ్రీకారం

కాంగ్రెస్ పటిష్టతకు ప్రత్యేక ప్రణాళిక

జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్

పేరిట ఏడాదిపాటు కార్యక్రమాలు

ప్రతీ గ్రామంలో పాదయాత్రలు

8

సర్కారీ బడుల్లో ఏఐ ఎంట్రీ

కృత్రిమ మేధతో విద్యార్థులకు పాఠాలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఏటేటా అభ్యసన సామర్థ్యాలు తగ్గిపోవడం గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. స్టూడెంట్స్ విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు 'కృత్రిమ మేధ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముందుగా ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5వ తరగతులు చదివే వారిలో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో పాఠాలు బోధించనున్నారు. విద్యార్థులు తెలుగు బాగా చదవడం, గణిత అంశాల్లో పట్టు సాధించేలా కృత్రిమ మేధ సాయంతో ఆకట్టుకునే విధంగా పాఠ్యాంశాలను రూపొందించారు.

పఠనా సామర్థ్యాలు పెంచడమే లక్ష్యం

చదువుల్లో వెనకబడిన వారికి ఉపయోగకరం

ఉమ్మడి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద 43 స్కూళ్లు ఎంపిక

వచ్చే ఏడాది నుంచి ఏఐ ఒక సబ్జెక్టుగా బోధన

వికారాబాద్ జిల్లాలో 19 స్కూళ్లు ఎంపిక


త్వరలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

వికారాబాద్/మేడ్చల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 43 స్కూళ్లను ఏఐ ద్వారా విద్యాబోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది. పైలెట్ ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ఏక్ -స్టెప్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. తమిళనాడు రాష్ట్రంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమం సత్ఫలితాలిస్తుండగా, ఆ స్ఫూర్తితో తాజాగా మన రాష్ట్రంలో కృత్రిమ మేధ సాయంతో విద్యా బోధన కార్యక్రమం ప్రారంభించారు.

రంగారెడ్డి జిల్లాలో 12 స్కూళ్లు...

కృత్రిమ మేధ సాయంతో విద్యాబోధన చేసేందుకు రంగారెడ్డి జిల్లాలో మొత్తం 12 స్కూళ్లను ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో మొదటి విడతగా ఎంపీహెచ్ఎస్ కోకాపేట్, జడ్పీహెచ్ఎస్ పెద్దమంగళారం, జెడ్పీహెచ్ఎస్ రెడ్డిపల్లి, అజీజ్‌నగర్, టంగుటూరు, నర్కూడ, తంగడపల్లి, రావిరాల, పెద్ద ఎల్కిచర్ల స్కూల్‌లో మొదటి విడత పైలెట్ ప్రాజెక్టు కింద ఏఐ విద్యను ప్రారంభించింది. రెండో విడతలో మరో మూడు స్కూళ్లను ఎంపిక చేసింది. జెడ్పీహెచ్ఎస్ కొత్తపేట్, మజీద్‌నగర్, జిల్లేలగూడ పాఠశాలల్లో ఇంటెలిజెన్స్ విద్యను అమలు చేయాలని నిర్ణయించింది. 50మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లాలో 50 మందికిపైగా ఉన్న

మిగతా 7వ పేజీలో...



వచ్చే ఏడాది నుంచి ఏఐ సబ్జెక్టుగా..

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఏఐ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ఒక సబ్జెక్టుగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రంగారెడ్డి జిల్లాలోని ఐదు ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసింది. మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, సరూర్‌నగర్ మండల బహదూర్‌గూడ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్, కేశంపేట మండలం కొత్తపేట్, గండిపేట మండలం కోకాపేట్ స్కూళ్లను ఎంపిక చేసింది. ఎంపికైన ఈ పాఠశాలల నుంచి ఒక్కో స్కూల్ నుంచి ఒక టీచర్, సీఆర్‌పిఎఫ్‌కి ఒక రోజు పాటు శిక్షణ ఏప్రిల్‌లో ఇవ్వనున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏఐ ప్రపంచాన్నే శాసిస్తుంది.



ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని శాసిస్తుంది. అన్నిరంగాల్లో ఏఐ వినియోగం అనివార్యమైంది. విద్యార్థుల్లో పరిజ్ఞానం, నైపుణ్యాన్ని పెంచేందుకు ఏఐ విద్య విద్యార్థులకు ఉపయోగకరం. సర్కార్ స్కూళ్లలో ఏఐ విద్యను సబ్జెక్టుగా పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే తొమ్మిది స్కూళ్లలో ఏఐ విద్యను అమలు చేస్తోంది. కొత్తగా మరో మూడు స్కూళ్లను కూడా చేర్చడం జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం మరో ఐదు స్కూళ్లలో బోధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి టీచర్లకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నాం. -సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి, రంగారెడ్డి

సన్నబియ్యం నిల్వలపై ఆరా

» కాంట్రాక్టర్లతో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ సమీక్ష

మేడ్చల్ ప్రతినిధి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గోదాములలో సన్న బియ్యం నిల్వలపై కలెక్టర్ గౌతమ్ ఆరా తీశారు. సకాలంలో సరుకులు గోదాంకు చేరేలా, సన్న బియ్యం పంపిణీలో ఎటువంటి ఆలస్యం జరుగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో సన్న బియ్యం పంపిణీపై శుక్రవారం ఆయన పౌరసరఫరాల జిల్లా మేనేజరు సుగుణ బాయి, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇతర జిల్లాల నుంచి బియ్యం సకాలంలో రావడానికి డిప్యూటీ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్‌ను ఆదేశించారు.



సీపీవోగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

వికారాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీపీవోగా పనిచేసిన అశోక్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై రాష్ట్ర కార్యాలయానికి బదిలీ అయ్యారు. డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు వికారాబాద్ జిల్లా సీపీవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సన్నబియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సన్నబియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ శాంతకుమారి, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పౌర సరఫరాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం మార్గ దర్శకాలకు అనుగుణంగా లోటుపాట్లకు తావునివ్వకుండా సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

భోజనంతో పాటు వసతులపై శ్రద్ధ తీసుకోవాలి

తాండూరు: వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పనతో పాటు క్రీడా వస్తువులు అందజేస్తామని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆయన శుక్రవారం ఆయన ఆకస్మికంగా తాండూరలోని హాస్టళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదవాలని సూచించారు. విద్యార్థులకు భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. ఈ సందర్భంగా వంటగది, సరుకుల గది, విద్యార్థుల గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ సుశీల్ కుమార్, వసతి గృహాల సంక్షేమ అధికారి శ్రీశైలం ఉన్నారు.

పరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుద్యాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం తాండూర్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దుద్యాల మండలం హకీంపేట్, లగచర్ల గ్రామాలకు చెందిన రైతులకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, దుద్యాల తహసీల్దార్ కిషన్‌నాయక్‌తో కలిసి పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. దుద్యాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం హకీంపేట్, లగచర్ల గ్రామాలకు చెందిన 25 మంది 31.08 ఎకరాల భూమిని ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, నర్సింలుయాదవ్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, హనుమంతు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



అవార్డును అందుకుంటున్న కమిషనర్ జాకీర్‌అహ్మద్

ఆస్తిపన్ను వసూలులో 'వికారాబాద్' రికార్డు

వికారాబాద్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూళ్లలో వికారాబాద్ మునిసిపాలిటీ ముందు వరుసలో నిలిచింది. 89.18శాతం వసూళ్లతో జిల్లాలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తెలంగాణ, నుంచి ప్రత్యేక అభినందనలు లభించాయి. హైదరాబాద్‌లో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు వ్యాపారస్థులు తమ భద్రత, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం పన్నులు సమయానికి చెల్లించడం వల్లనే ఈ ప్రగతి సాధ్యమైందని తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా ఇలాగే ఆదరణ కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అసైన్డ్ భూములు మాయం!

ఇష్టారీతిన వెలుస్తున్న నిర్మాణాలు



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు(ఫైల్)

నిర్మాణాలు చేసేది ఒకరు.. విక్రయించేది మరొకరు

అన్యాక్రాంతమవుతున్న రూ.కోట్ల విలువైన భూమి


అధికారుల మద్దతుతోనే తతంగం!

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ఆందోళన వ్యక్తం చేస్తున్న కేశవరం ప్రజలు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామమైన కేశవరంలో రూ.కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ నేతలు కాజేస్తున్నారని ఆరోపణలు చేసిన ఆనాటి ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అధికారులను మచ్చిక చేసుకుని రాజకీయ పలుకుబడి ఉపయోగించి అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతన్నారు. వాటాలేసుకుని పోటీపడి మరీ కబ్జాలు చేస్తున్నారు. ఈ తతంగం మూడుచింతలపల్లి మండలంలో ఇష్టరాజ్యంగా నడుస్తున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం తమకేదీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. వివిధ పార్టీల్లో ముఖ్య నాయకులుగా చెప్పుకొనే వారే అసైన్డ్ భూములను అందినకాడికి

మిగతా 8వ పేజీలో...



కీసరగుట్టలో అద్భుతం

మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అద్భుతం జరిగింది. గర్భగుడిలోని మూలవిరాట్‌పై సూర్య కిరణాలు నేరుగా ప్రసరించాయి. శివలింగం సూర్య కిరణాలతో ప్రకాశిస్తున్న మనోహర దృశ్యాన్ని పలువురు భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. చైత్రమాసంలో శ్రీరామనవమి సమయంలో సూర్య కిరణాలు ఇలా స్వామి వారిపై ప్రకాశించడం విశేషమని ఆలయ పండితులు చెబుతున్నారు.

-కీసర, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి)

మట్టి మాఫియాపై నజర్

» అక్రమ తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

» హిటాచీ, టిప్పర్లు సీజ్.. నిందితులపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీజ్ చేసిన టిప్పర్లు

తాండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో రెచ్చిపోతున్న మట్టి మాఫియాపై అధికార యంత్రాంగం కదిలింది. మట్టి మాఫియా ఆగడాలను అరికట్టేందుకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి(మొరం) తవ్వకాలు జరుపుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్, యాలాల పోలీసులు దాడులు నిర్వహించారు. తాండూరు శివారులోని హైదరాబాద్ రోడ్డులో రాజీవ్ కాలనీ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వెనకాల ఖాళీ స్థలంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుండగా దాడులు చేశారు. ఒక హిటాచీతోపాటు ఎనిమిది టిప్పర్లను అదుపులోకి తీసుకొని యాలాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు. మట్టి, సుద్ద, నాపరాయి అక్రమ రవాణాపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాఫియాపై అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకున్నారు. అధికారపార్టీ వారైనా అక్రమాలకు పాల్పడితే వదలొద్దని అధికారులకు సూచించారు.



పాంబండ ఆలయ హుండీ లెక్కింపు

కులకచర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ దేవాలయ హుండీని శుక్రవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.3,36,835 రాగా, మూడు కోడెలు వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య తెలిపారు. ఆలయానికి వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

కేశంపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యువత చదువులతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య సూచించారు. మండల పరిధిలోని లింగంధన గ్రామంలో శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి వంశి, నాయకులు రొల్ల రాఘురాములుగౌడ్, నరసింహ, యుగేందర్, శేఖర్, వెంకటేశ్వర్, శివచారి, యాదగిరి, అశోక్ ఉన్నారు.


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అందె బాబయ్య

గౌడవెల్లిలో ముగ్గురిపై కుక్కల దాడి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ గౌడవెల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. శుక్రవారం ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి గాయపరచగా, ఇంటి ముందు ఆడుకుంటున్న ఓ బాలుడిపై దాడి చేసి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కొద్ది రోజులుగా గ్రామంలో వీధి కుక్కల బెడద పెరిగిందని స్థానికులు తెలిపారు. ఒంటరిగా వీధుల్లో తిరగాలంటే వణుకు పుడుతుందని, గ్రామంలో కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బీజేపీది

మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీది రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర అని కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ భారత్ జూడో యాత్ర ద్వారా దేశ ప్రజలను సమానత్వం, సౌభ్రాతృత్వంతో చైతన్యవంతం చేశారన్నారు. 11 ఏళ్లుగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలని కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బీజేపీ చేస్తోందని మండిపడ్డారు. జనవరిలో పార్లమెంట్ వేదికగా కేంద్రమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విలువలని గౌరవిస్తూ, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జై బాపు, జై భీమ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనీతారెడ్డి, మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎస్ కృష్ణానాయక్, డైరక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

సుల్తాన్‌పూర్‌లో తాగునీటి కటకట!

పరిగి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్‌లో తాగునీటి సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామాన్ని ఇటీవల పరిగి మున్సిపాలిటీలో విలీనం చేసిన విషయం తెలిసిందే. మిషన్‌భగీరథ నీరు సరిగ్గా సరఫరా కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. అక్కడక్కడా లీకేజీ అయిన చోట నీటిని పట్టుకొని వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సుల్తాన్‌పూర్ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.





వైద్యాధికారిగా కిరణ్‌కుమార్‌గౌడ్


వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కులకచర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిగా పి.కిరణ్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన వాజియోద్దీన్ పీజీ శిక్షణకు వెళ్లారు. ఆయన స్థానంలో పరిగిలో పని చేస్తున్న పి.కిరన్‌కుమార్‌గౌడ్ కులకచర్లకు వచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్. ఆంజనేయులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి


పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, పెన్నుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్‌గుప్త, ఆనంద్‌రెడ్డి, మురారి, దాము, టి.శేఖర్, మునీర్, సంతోష్, భీములు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తైబజార్ వేలం @ రూ.10లక్షలు

తాండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో శుక్రవారం తై బజార్, స్లాటర్ హౌస్, బీఫ్ షాపులకు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటను ఇంచార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. తైబజార్‌ను తాండూరు పట్టణానికి చెందిన మొజెమ్ రూ. 10లక్షల 21,500లకు హెచ్ పాట పాడి దక్కించుకున్నారు. తై బజార్‌కు ముగ్గురు పోటీపడ్డారు. స్లాటర్ హౌస్ రూ. 61వేలలకు మజీద్ ఖురేషి దక్కించుకున్నారు. స్లాటర్ బీఫ్‌ను రూ. 53వేలకు అజీం ఖురేషి దక్కించుకున్నారు. ఈ వేలం పాట కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇంచార్జ్ ఆర్‌ఐలు రమేష్, అశోక్ పాల్గొన్నారు.



మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు

వరంగల్ సభను విజయవంతం చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకులకు సూచించారు. శుక్రవారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్ మహేష్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనిపల్లి శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న బూర నర్సయ్యగౌడ్

బీజేపీ పటిష్టతకు పాటుపడాలి

» మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

మన్సూరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి అర్బన్‌లో ఏ ఎన్నిక వచ్చినా బీజేపీ అభ్యర్థులు గెలిచేలా పార్టీని పటిష్టం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ రంగారెడ్డి అర్బన్ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై చేపట్టబోయే చలో హెచ్‌సీయూకి కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ బీజేపీ పటిష్టతకు ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్‌జీ, బీజేపీ జాతీయ నాయకుడు పేరాల చంద్రశేఖర్ రావు, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులు పూర్తికాగానే ఉద్యోగాల కోసం కాకుండా పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ దివ్య నల్ల అన్నారు. పోచారం మున్సిపాలిటీ, దివ్యానగర్, నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగు కళాశాలలో ఎంబీఏ విభాగంలో రెండు రోజులపాటు జరిగిన 'పరిశ్రమలు - అనుసంధానం' ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా, గొప్ప ఉద్యోగులుగా తీర్చిదిద్దడానికి కళాశాలలు మార్గనిర్దేశం చేయాలన్నారు. పరిశ్రమలకు కావాల్సిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు మంచి అవకాశాలు వస్తాయన్నారు.

సర్కారీ బడుల్లో ఏఐ ఎంట్రీ

(ఐదో పేజీ తరువాయి)

పాఠశాలలలు పీఎస్, యూపీఎస్‌లు 410కి పైగా ఉన్నట్లు గుర్తించారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం, మైక్రో ఫోన్, హెడ్ ఫోన్లు ఉన్న స్కూళ్లలో విద్యార్థులకు ఏఐ ద్వారా విద్యను అందించనున్నారు. ఫండమెంటల్ లిట్రసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) ప్రకారం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, లెక్కల్లో కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగాహారాలు చేయడం వంటి చతుర్విధ ప్రక్రియలను ఇప్పటికే నేర్పిస్తున్నారు. వీటికి తోడుగా ఎఎక్స్ఎల్ పేరుతో ఇంటెలిజెన్స్ విద్యను అందించనున్నారు. 3,4,5 తరగతుల్లో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కంప్యూటర్ ద్వారా విద్యను అందించనున్నారు. ఫస్ట్ లెవల్‌లో డిస్కవరిలో ఏఐ పిల్లల శక్తి సామర్థ్యాలు తెలుసుకునేందుకు కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. దృశ్య, శ్రవణం ద్వారా జవాబు కూడ చెబుతుంది. కంప్యూటర్, ఇంటర్నెట్ సౌకర్యం లేని స్కూళ్లలో ఇప్పటికే టాప్‌లు ఉన్నాయి. వాటి ద్వారా ఒక్కో పాఠశాలలో 8 మంది విద్యార్థులను గుర్తించి ఏఐ ద్వారా విద్యను అందించనున్నారు. ఇప్పటికే ఒక విడత కొంత మంది టీచర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది.

వికారాబాద్‌లో 19 స్కూళ్లు

రెండు విడతల్లో వికారాబాద్ జిల్లాలో మొత్తం 19 ప్రాథమిక పాఠశాలలు ఎంపిక చేశారు. మొదటి విడతలో తాండూరు మండలంలో సాయిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, కొడంగల్ మండలంలో ప్రభుత్వ కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాల, పరిగి మండలంలో గడిసింగాపూర్, వికారాబాద్ మండలంలో పులుమద్ది, దోమ మండలంలో బొంపల్లి, కోట్‌పల్లి మండలంలో ఎన్నారం ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సాంకేతికత సాయంతో విద్యా బోధన ప్రారంభించారు. రెండో విడతలో దోమ మండలంలో గుమ్‌డాల్, ఐనాపూర్, దోమ ప్రాథమిక పాఠశాలలు, మోమిన్‌పేట్ మండలంలో టేకులపల్లి, మొరంగపల్లి, వెల్చాల్, ఏన్కతల, మోమిన్‌పేట్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలు, పెద్దేముల్ మండలంలో అడ్కిచర్ల, ఉరెంటి తండా, పెద్దేముల్, ఇందూరు తెలుగు, ఇందూరు ఇంగ్లీష్ మీడియం ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధ విద్యా బోధన కొనసాగుతోంది. మొత్తం 19 ప్రాథమిక పాఠశాలల్లో 1273 మంది విద్యార్థులు కృత్రిమ మేధ ఆధారిత విద్య నేర్చుకుంటున్నారు. ఏఐ విద్యా బోధనకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాలల్లో 2 నుంచి 5 వరకు కంప్యూటర్లు, హెడ్‌సెట్లు, ఇంటర్నెట్ సదుపాయం కల్పించి కృత్రిమ మేధ సాయంతో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద గతనెల 24న మొదటి విడతలో ఆరు ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను



ప్రారంభించి కృత్రిమ మేధతో విద్యా బోధన ప్రారంభించగా, మిగతా ప్రాథమిక పాఠశాలల్లో ఆ తర్వాత ప్రారంభించారు. అలాగే మేడ్చల్ మల్కాజిరిగి జిల్లాలో జనతానగర్, కొంపల్లి, ప్రగతినగర్, మల్లాపూర్, ఎల్లమ్మబండ, బహదూర్‌పల్లి పాఠశాలలో ఏఐ విద్యను అందించనున్నారు.

అభ్యసనం మెరుగు పడేలా....

ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగు పర్చేందుకు విద్యా శాఖ ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. 2027వరకూ ప్రతి విద్యార్థికి రాయడం, చదవడం, సంఖ్యా భావనతో పాటు చతుర్విధ ప్రక్రియలు రావాలనేది లక్ష్యంగా నిర్దేశించుకున్నా.. ఆశించిన స్థాయిలో లక్ష్యాలు సాధించలేకపోతున్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించుకునే దిశగా విద్యాశాఖ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం కొనసాగనుంది. కంప్యూటర్, ఇయర్ హెడ్స్ స్పీకర్‌తో పాటు కంప్యూటర్ లాగిన్ ఐడీ నంబర్ ఇచ్చారు. ఎక్స్‌స్టెప్‌లో ఫౌండేషన్ ఏఐ లెర్నింగ్ టూల్స్, అసిస్టెడ్ లాంగ్వేజ్ లెర్నింగ్ (ఏఎల్ఎల్), అసిస్టెడ్ మ్యాథమెటిక్ లెర్నింగ్ (ఏఎంఎల్) ఇన్‌స్టాల్ చేశారు. ఎఫ్ఎల్ఎన్ ద్వారా నేర్చుకున్న అంశాలను కంప్యూటర్ ముందు తప్పుగా చదివితే.. తప్పులకనుగుణంగా లోపాలను గుర్తిస్తుంది, జిల్లాలో ఎంపిక చేసిన ఆరు ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో కొనసాగుతున్న విద్యార్థుల్లో చదువుల్లో వెనకబడిన వారిలో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా 5, 10, 20 మందిని ఒక్కో బ్యాచ్‌గా విభజించి ఒక్కో బ్యాచ్‌కు తెలుగు, గణిత అభ్యాసాలపై 20, 40 నిమిషాల వంతున కృత్రిమ మేధ పాఠ్యాంశాల బోధన ప్రారంభించారు. అభ్యాసానికి సంబంధించిన అంశాల్లో 70 శాతంపైగా సరైన సమాధానాలు సాధిస్తేనే మరో పాఠ్యాంశం నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అంతకంటే తక్కువగా మార్కులు వస్తే ఆ పాఠ్యాంశాన్ని మరోసారి అభ్యాసం చేయాల్సి ఉంటుంది. తరగతుల నిర్వహణను విద్యా శాఖ అధికారులతో పాటు ఏక్ -స్టెప్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను మదింపు జేస్తారు. గతంలో కంటే విద్యార్థుల్లో సామర్థ్యాల పురోగతి ఆశించిన స్థాయిలో పెరిగాయా ? లేదా ? అనేది అంచనా వేయనున్నారు. తుది ఫలితాలపై సమీక్ష నిర్వహించి రాష్ట్ర విద్యా శాఖకు నివేదిక అందజేయనున్నారు. పైలెట్ ప్రాజెక్టు వియవంతమైతే ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం .. అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ముస్తాబైన మైసిగండి రామాలయం

» నేటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

» భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి

» 6న సీతారాముల పరిణయం.. రథోత్సవం



మైసిగండి రామాలయం



సీతారామచంద్రస్వామి మూలవిరాట్

కడ్తాల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కడ్తాల మండలంలోని మైసిగండి రామాలయం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. తెలంగాణలో భద్రాచలం తర్వాత ప్రభుత్వ లాంచనాలతో మైసిగండి రామాలయంలో సీతారాముల పరిణయం జరుగుతుంది. ఏటా చైత్రశుద్ధ అష్టమి నుంచి శుద్ధ దశమి వరకు కోదండరామచంద్ర స్వామి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు సాగే వేడుకల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ వేడుకను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాక హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, నల్గొండ, మెదక్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్ నగర్, యాదాద్రి, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

వేసవి దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు, ,తాగునీటి వసతి కల్పించారు. మండప దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ఆలయానికి చేరుకునేందుకు వీలుగా కల్వకుర్తి, ఆమనగల్లు, హైదరాబాద్ నుంచి మైసిగండికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు

భద్రాచలం మాదిరిగానే మైసిగండి రామాలయంలో ప్రభుత్వ లాంచనాలతో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. తెలంగాణ ప్రభుత్వం కల్యాణం రోజు ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితి. కల్యాణానికి ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు హాజరు కానున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

మైసిగండి రామాలయంలో ఈనెల 5 నుంచి 7 వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలీ, ఈఓ స్నేహలత వివరించారు. 5న విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అఖండ జ్యోతి స్థాపన, ధ్వజారోహనం, హోమశాల ప్రవేశం, 6న శ్రీరామ నవమి సందర్భంగా మధ్యాహ్నం 12.30 గంటలకు సీతారాముల పరిణయ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు స్వామి వారి రథోత్సవం, 7న చక్రతీర్థం, పుష్కరస్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని సిరోలిపంతూ, స్నేహలత కోరారు.

అంతిరింతిరి కొండపై ప్రత్యేక ఏర్పాట్లు



ముస్తాబైన ఆంజనేయ స్వామి దేవాలయం

ఆమనగల్లు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణ సమీపంలోని మాడ్గుల రోడ్డులోని అంతిరింతిరి కొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా ఈ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలను కనుల పండువగా నిర్వహిస్తారు. ఈనెల 6న నిర్వహించే వేడుకలకు నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం ఉదయం 11.45 గంటలకు సీతారాముల కల్యాణం ఉంటుందని ఆలయ పూజారి పతంగి నాగఫణిశర్మ, నిర్వాహకులు పేర్కొన్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సమష్టి కృషితోనే ఉత్తమ అవార్డులు

» తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

శామీర్‌పేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితోనే 86 శాతం ఆస్తి పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో రెండు ఉత్తమ అవార్డులు సాధించామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నెలపాటు మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్లు ఎంతో శ్రమించి రాష్ట్ర స్థాయిలో అత్యధికంగా ఆస్తి పన్ను వసూలు చేశారన్నారు. మున్సిపల్ పరిధిలో రూ.15.22 కోట్ల ఆస్తి పన్ను వసూలు లక్ష్యం కాగా రూ.12.65 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.2.56 కోట్లు వసూలు చేయాల్సి ఉందని, త్వరలోనే అవి కూడా వసూలు చేస్తామని పేర్కొన్నారు. ఉత్తమ అవార్డులు రావడంపై సిబ్బందిని అభినందించారు.

వేడుకలకు వేళాయె..

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన చిలుకూరు బాలాజీ ఆలయం

» 7న ఉత్సవాలకు అంకురార్పరణ

» అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

» ఈ ఏడాదీ గరుడ ప్రసాద వితరణ లేనట్లే..



మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతి చిలుకూరు బాలాజీ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. వారంపాటు కొనసాగనున్న వేడుకలకు ఈ నెల 7 సోమవారం అంకుర్పారణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేస్తున్నారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణోత్సవ మండపానికి సున్నం, రంగులు వేశారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రధానద్వారం ఎదుట కోనేరును సుందరీకరించారు. భక్తులకు సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

కార్యక్రమాల వివరాలు..

వారంపాటు కొనసాగనున్న ఆలయ బ్రహ్మోత్సవాలకు 7న సోమవారం సాయంత్రం సెల్వర్‌కుత్తు, పుట్టమన్ను తీసుకువచ్చి అంకురార్పణ చేస్తారు. 8న ఉదయం ధ్వజారోహణం, శేషవాహనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుత్మంతుడికి నైవేద్యం సమర్పిస్తారు. 9న గోప వాహనం, హనుమంతుడి వాహనం, 10న సూర్యప్రభ వాహనంతోపాటు సాయంత్రం శ్రీ వేంకటేశ్వర శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. రాత్రి 11గంటల నుంచి వేకువజాము వరకు ఈ తంతు కొనసాగుతుంది. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపాన్ని అలంకరిస్తున్నారు. 11న వసంతోత్సవం, గజవాహనం, 12న కల్యాణం, ముమ్మూర్తులకు పల్లకీ సేవ నిర్వహించి రాత్రికి రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులు ఆశీనులై ఉండే రథాన్ని లాగితే శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. 13న మహాభిషేకం, అశ్వవాహనం, ఆస్థాన సేవ, దోప్‌సేవ, పుష్పాంజలి, 14న చక్ర తీర్థం, ధ్వజావరోహణంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. 8న ధ్వజరోహణం అనంతరం సంతానం లేని మహిళలకు అందించే గరుడ ప్రసాదం పంపిణీ ఈ ఏడాది లేదు. దీనిని భక్తులు గమనించాలి. గతేడాది భక్తుల తాకిడీ వల్ల తీవ్ర సమస్యలు ఎదురయ్యాయి. ఈ నెలలో బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత మే నెలలో ప్రతి శుక్రవారం దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రసాదాన్ని పంపిణీ చేస్తాం. అన్ని శాఖల అధికారులు, చిలుకూరు గ్రామస్తులు ఉత్సవాలకు సహకరించాలి.

- సీఎస్ రంగరాజన్, ఆలయ ప్రధాన అర్చకులు

కోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైడ్రా, మున్సిపల్ అధికారులు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి నల్ల మల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో ఆరోపించారు. పోచారం మున్సిపాలిటీ, కొర్రెముల సర్వే నంబర్ 739/ఎ లోని తన ఇంటి ముందు మున్సిపాలిటీ అధికారులు హైడ్రా అధికారుల ఆదేశానుసారం యుద్ధప్రాతిపదికన సీసీ రోడ్డు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జనవరిలో అకారణంగా హైడ్రా అధికారులు గోడలు కూల్చివేశారని, దీనిపై హైకోర్టును ఆశ్రమించామని పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోర్టు సూచించినప్పటికీ అధికారులు తమ పట్టా భూమిలో నుంచి సీసీ రోడ్డు వేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా, మున్సిపల్ అధికారులు కోర్టు ఆదేశాలను దిక్కరించి రోడ్డు వేయడంపై న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు.

అన్నదాతలకు అండగా కాంగ్రెస్

» సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ట్రాక్టర్ కల్టివేటర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి, వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతకు అండగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆరుగురు మహిళా రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్ కల్టివేటర్లను పంపిణీ చేశారు. నియోజక వర్గంలోని మధురాపురం గ్రామానికి చెందిన లక్ష్మాపురం అక్షర, అల్వాల గ్రామానికి చెందిన శ్రీలత, కేశంపేటకు చెందిన యాదమ్మ, కడియాలకుంట తండాకు చెందిన ధనమ్మ, ఉత్తరాశిపల్లికి చెందిన మారు, చేగూరుకు చెందిన మాధవిలకు కల్టివేటర్లను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రాజరత్నం, ఏఓలు నిశాంత్‌కుమార్, శిరీష, సురేష్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శోభ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

ప్రచార ఉద్యమంతోనే ప్రజా చైతన్యం

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ ప్రచార ఉద్యమంలో జాతిపిత మహాత్మగాంధీ గొప్పతనం, రాజ్యాంగ అవసరాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యం తేవడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ శివారులోని ఎన్‌హెచ్-44 హోటల్‌లో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతిపిత గొప్పతనాన్ని, రాజ్యాంగ అవసరాలను, కాంగ్రెస్ నేతల త్యాగాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, కార్యక్రమ కో ఆర్డినేటర్ జైపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరి విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, రఘునాయక్, వెంకట్‌రాంరెడ్డి, విశాల, శ్రీకాంత్‌రెడ్డి, చెన్నయ్య, నర్సింహయాదవ్, సుదర్శన్‌గౌడ్, కృష్ణారెడ్డి, వీరేశం, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

వికారాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తమ బతుకుల్లో వెలుగును నింపిందని 2008డీఎస్సీ ఉద్యోగులు పేర్కొన్నారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2008 డీఎస్సీ ద్వారా ప్రస్తుతం ఉద్యోగులు పొందిన వారు పాల్గొన్నారు.

చెక్కులను వెంటనే అందించాలి

కీసర రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డికి ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

'సంవిధాన్'కు శ్రీకారం

- కాంగ్రెస్ పటిష్టతకు ప్రత్యేక ప్రణాళిక
- జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ పేరిట ఏడాది పాటు కార్యక్రమాలు
- ప్రతీ గ్రామంలో పాదయాత్రలు

తాండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ పటిష్టతకు ఈ కార్యక్రమాన్ని వేదికగా చేశారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందుకోసం గ్రామ, గ్రామాన ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

గ్రామాలకు మోడల్ కిట్లు

టీపీసీసీ కార్యాలయం నుంచి ప్రతీ మండలానికి మోడల్‌కిట్ అందజేశారు. ఇందులో కాంగ్రెస్ జెండా-ఖాదీ, భారత రాజ్యాంగకాపీ, మహాత్మాగాంధీ ఫొటో, బీఆర్ అంబేడ్కర్ ఫొటో, అభియాన్‌పై సాహిత్యం, అదనంగా కరపత్రాలు, రాజ్యాంగ, రాజకీయ, కాంగ్రెస్ పథకాల వివరాలు అందజేశారు. పాదయాత్రలో భాగంగా ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లినవేళ గ్రామ అధ్యక్షుడికి ఇవి అప్పగించాలి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ పాదయాత్ర పూర్తయ్యే వరకు దీనిని కొనసాగించాలి. ముఖ్యంగా ఉదయం రెండు గ్రామాలు, సాయంత్రం రెండు గ్రామాల్లో పాదయాత్ర చేపట్టాలి. అన్నిగ్రామాల ముగింపులో మండల ప్రధాన కార్యాలయం, మండలంలోని ఒక ప్రధాన గ్రామంలో మండల ముగింపు సమావేశాన్ని ప్లాన్ చేసుకోవాలని నిర్ణయించారు. తాండూరు నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశం ఈనెల 3న (గురువారం) ముగిసింది.



మోడల్ కిట్లను అందజేస్తున్న ప్రోగ్రాం ఇన్‌చార్జి రాజీవ్‌రెడ్డి

రాజ్యాంగ ప్రాముఖ్యతపై యాత్రలో వివరణ

భారత రాజ్యాంగం అధికారికంగా 26 నవంబరు 1949న ఆమోదించారు. జనవరి 26, 1950న అమలులోకి వచ్చింది. ఈ 75ఏళ్ల ప్రాముఖ్యతను పాదయాత్రలో కాంగ్రెస్ నాయకులు వివరించనున్నారు.

ఏడాది పాటు కార్యక్రమాలు

మహత్మాగాంధీ వారసత్వాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడమనే ఆవశ్యకత దృష్ట్యా ఈ ఉద్యమం కొనసాగనుంది. ఈఏడాది జనవరి 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 మధ్య సీడబ్ల్యూసీ సంవిధాన్ బచావో రాష్ట్రీయ పాదయాత్ర పేరుతో దేశవ్యాప్తంగా భారీ ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ పాదయాత్రలో నాయకులు గ్రామం నుంచి గ్రామానికి, పట్టణానికి రిలే ఫార్మట్‌లో పాదయాత్ర చేయమన్నారు.

ఊరురా కార్యక్రమాలను చేపడుతాం



'జై బాపు.. జై బీమ్.. జై సంవిధాన్' కార్యక్రమంలో రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాపాడుకోవడానికి ప్రజలకు వివరిస్తాం. ప్రజలంతా ఏకమై పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని చెబుతూనే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన సందర్భంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు. **- మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు**

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జుంటుపల్లి సీతారామస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అంతకుముందు జుంటుపల్లి రామస్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీధర్, అక్బర్‌బాబా పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

పెద్దేముల్: ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయురాలు సంధ్యారాణి, ఎంపీడీవోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన జర్దప్పలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, తహశీల్దారు వెంకటేష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

'బంద్ నుంచి మినహాయించండి'

తాండూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మాంసం విక్రయదుకాణాలు బంద్ పాటించాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. దీంతో చిరువ్యాపారులు తమకు నష్టం కలుగుతోందని శుక్రవారం ఇన్‌చార్జి కమిషనర్ విక్రంసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బంద్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారం తాండూరు పట్టణంలో చర్చగా మారింది.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎండీ యూసుఫ్, నరేష్, బాలరాజ్, దశరథ్, పవర్, రియాజ్ ఉన్నారు.

ఐదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు

పరిగి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి వచ్చే విద్యా సంవత్సరానికి వేరే పాఠశాలకు వెళ్లనున్న సందర్భంగా వారికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆటల, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఏహెచ్‌ఎం ఎండీ ఉస్మాన్‌అలీ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, నర్సింహులు, రాజు,కవిత,శిక్షణ ఫౌండేషన్ మెంటార్ హన్మంత్ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా బొంరాస్‌పేట్‌లో కోలాహలం నెలకొంది. మండల కేంద్రంలో భక్త సమాజం ఆవరణలో జరిగే సీతారాముల కల్యాణోత్సవానికి గ్రామస్థులు, యువకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చలువ పందిళ్లు, టెంట్లు, తోరణాలు కడుతున్నారు. శుక్రవారం పురవీధుల్లో కాషాయ తోరణాలు, జెండాలను ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం భూ లక్ష్మమ్మ చౌరస్తా నుంచి సీతారాముల ఎదుర్కోళ్ల కార్యక్రమంతో పాటు ఆదివారం కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో హోమం

పూడూరు, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి): రాకంచర్ల ససంఘ మండలి ఆధ్వర్యంలో రాకంచర్ల లక్ష్మీనడీ స్వామి ఆలయంలో శుక్రవారం హోమం నిర్వహించారు. మండలంలోని సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన రఘురామ్‌రెడ్డి అధ్యక్షనత కుటుంబ సమేతంగా యజ్ఞంలో పాల్గొన్నారు. ఐదు రోజులుగా భజన, 500 కీర్తన పారాయణం, హోమం, హనుమాన్ చాలీసా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఉమ్మెంతల్ పీఠాధిపతులు వెంకటదాస్ పాల్గొన్నారు.

ఎన్కతలలో భూ సర్వే

మోమిన్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్కతల గ్రామ శివారులోని 169, 171 సర్వే నెంబర్‌లలో హైదరాబాద్‌కు చెందిన వివేక్ అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేశాడు. దానికి ఆనుకొని చెరువు శిఖం భూమి 214 సర్వే నెంబర్ ఉంది. ఈ విషయంపై గ్రామస్థులు మండల అధికారులకు ఫిర్యాదు చేయడంతో పలుమార్లు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. భూ యజమాని వివేక్ కోర్టును ఆశ్రయించగా కోర్టు ఉత్తర్వుల మేరకు సర్వే నెంబరులు 171, 214ను ఇరిగేషన్ అధికారులు భాస్కర్, రవితేజ, ఆర్ఐ గోవర్ధన్, సర్వేయర్ శ్రీనివాస్ గ్రామస్థులతో కలిసి శుక్రవారం సర్వే చేశారు. వివేక్ ఆక్రమించిన భూమిని అందరి సమక్షంలో హద్దులు ఏర్పాటు చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు, బీజేపీ మోమిన్‌పేట్ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ నెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని రాజశేఖర్‌రెడ్డి బీజేపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

మోమిన్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ ఆఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో మల్లేశం అన్నారు. మండలంలోని లచ్చనాయక్ తండా పాఠశాలను దత్తత తీసుకొని విద్యార్థులకు చేయూతనిస్తున్న సందర్భంగా సంస్థ నిర్వాహకులను వారు అభినందించారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్జ్ సమన్వయంతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం



కులకచర్ల: తిరుమలపూర్‌లో సన్న బియ్యం పంపిణీలో డీసీసీ కార్యవర్గ సభ్యుడు వెంకటయ్యగౌడ్



మర్పల్లి: మల్లికార్జునగిరిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పేదలకు వరం లాంటిదని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గిరిజాపూర్‌లోని రేషన్‌షాపులో శుక్రవారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, అక్బర్ బాబా పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని అప్పాయిపల్లి రేషన్ దుకాణంలో శుక్రవారం సన్నబియ్యం పంపిణీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముద్దప్పదేశ్‌ముఖ్, ఎన్.ప్రశాంత్ పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులోని రేషన్ దుకాణాన్ని శుక్రవారం సివిల్ సప్లయి కార్పొరేషన్ ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ తనిఖీ చేశారు. దుకాణంలోని సన్నబియ్యం సంచులను తూకం వేయించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈనెల కోటా 321 బస్తాలలో 159.25క్వింటాళ్ల బియ్యం వచ్చాయని డీలర్ తెలిపాడు.

వికారాబాద్: పీరంపల్లి గ్రామంలో శుక్రవారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారెడ్డి రేషన్ షాపులో సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లేశ్, నర్సింహా, అంజయ్య, బిక్షపతి ఉన్నారు.

కులకచర్ల: మండలంలోని తిరుమలాపూర్‌లో లబ్ధిదారులకు సన్న బియ్యం పథకాన్ని డీసీసీ కార్యవర్గ సభ్యుడు పెంటమీది వెంకటయ్యగౌడ్ శుక్రవారం ప్రారంభించారు.

దుద్యాల: మండలంలోని హకీంపేట్, కుదురుమళ్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ దుద్యాల మండల వర్కింగ్ ప్రసిడెంట్ సంజీవరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు.

బొంరాస్‌పేట్: మహంతీపూర్ గ్రామంలోని రేషన్ దుకాణంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహగౌడ్, రాంచంద్రారెడ్డి, మహిపాల్ పాల్గొన్నారు.

పూడూరు: తుర్కఎన్కెపల్లిలోని రేషన్‌షాపులో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సి.ప్రభాకర్ సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీలర్ సునీత, సి.అంజయ్య, గోపాల్ పాల్గొన్నారు.

పరిగి: నస్కల్‌లో గ్రామ మాజీ ఎంపీటీసీ సంపూర్ణ వెంకటయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు డి.అశోక్‌ల చేతులమీదుగా సన్నబియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా గడిసింగాపూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు జి.వెంకట్‌రాంలు. వెంకటయ్యలు, రాఘవాపూర్‌లో మండల పార్టీ ప్రధానకార్యదర్శి ఎం.సత్యనారాయణరెడ్డి సన్న బియ్యం పంపిణీ చేశారు.

చౌడాపూర్: చౌడాపూర్, మందిపాల్, పర్సంపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లటి అశోక్‌కుమార్ ప్రారంభించారు.

దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్‌లో సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్ శుక్రవారం ప్రారంభించారు.

మోమిన్‌పేట్: ఇజ్రాచిట్టంపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు సుభాష్ సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ పాల్గొన్నారు.

మర్పల్లి: మల్లికార్జునగిరిలో ప్రభుత్వం ద్వారా రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందిస్తున్న సన్న బియ్యం పంపిణీని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్ ప్రారంభించారు.

కోట్‌పల్లి: ఎన్నారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు.

దోమ: మల్లెపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీని పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డితో కలిసి ప్రారంభించారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు.

అసైన్డ్ భూములు మాయం!

(ఐదో పేజీ తరువాయి)

మింగేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్‌డీఎస్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులతో ఒక్కసారిగా ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఇది అక్రమార్కుల పాలిట వరంలా మారి ఎక్కడ అసైన్డ్, ప్రభుత్వ భూములు కనిపించినా కబ్జా చేసి విక్రయాలు చేపడుతున్నారు. ఇక్కడ విడ్డూరం ఏమిటంటే ఒక రెవెన్యూ అధికారే ముడుపులు పుచ్చుకొని మరీ సహకరిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం.

నిర్మించేది ఒకరు.. విక్రయించేది మరొకరు

కేశవరం గ్రామ పరిధిలోని సర్వే నంబరు 226లో సుమారు 28.26ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. గతంలో ఈ భుమిలో కొంత భాగాన్ని మాజీ సీఎం కేసీఆర్ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి కేటాయించారు. అక్కడ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. మిగిలి ఉన్న భూమిని కొందరు గ్రామపెద్దలు రూ.2 లక్షలకే కొనుగోలు చేసి పంచుకున్నారు. గ్రామంలో ఎవరికీ అనుమానం రాకుండా కొందరిని మేనేజ్ చేస్తూ గ్రామస్తులే ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని నమ్మబలికించి నిర్మాణాలు పూర్తయ్యాక మార్కెట్‌లో విక్రయానికి పెట్టి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. కొద్ది రోజుల్లో మూడు చింతలపల్లి మండలం మున్సిపాలిటీ అవుతుందని ఇంకా భూముల ధరలు పెరుగుతాయని ఇప్పుడే కొనుగోలుకు అవకాశం ఉందని చేయడానికని ప్రజాప్రతినిధులు లేరని రెవెన్యూ అధికారులను మేనేజ్ చేస్తాం అని చెప్పుకుంటూ తాము ముందుంటామని మాయమాటలు చెప్పి అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.


కాసులిస్తే ఒకలా.. లేకపోతే మరోలా

గత కొద్ది నెలల క్రితం అసైన్డ్ భూమిలో గ్రామస్తులు ఇళ్ల నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి నానా హంగామా చేసి కూల్చివేతలు చేపట్టారు. కాసులు సమర్పించడంతోనే మళ్లీ ఆ భూమిలో నిర్మాణం పూర్తయిందని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. అసైన్డ్ భూమిలోని మరో చోట కొందరు ప్రీ కాస్ట్ వాల్స్ వేసి, కొన్ని నిర్మాణాలు చేసి విక్రయిస్తుంటే ఫీల్డ్‌పై వెళ్లిన అధికారి చర్యలు తీసుకోకుండా ముడుపులు పుచ్చుకొని చూసీచూడనట్లు వ్యవహరించినట్లు గ్రామస్తులు గుసగుసలాడుకుంటున్నారు. రెవెన్యూ అధికారే అన్నీ తానై అందినకాడికి పుచ్చుకొని సెలవు దినంలో నిర్మాణాలు చేపట్టండని సలహాలు ఇవ్వడం గమనార్హం. ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారే అక్రమార్కులతో చేతులు కలిపి భక్షిస్తుంటే ఏవరికి చెప్పాలో అర్థం కావడంలేదని గ్రామస్తులు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ఈ అధికారి తమ రెవెన్యూ సిబ్బందితో కలిసి వివిధ గ్రామాల్లో భూముల సర్వేకు పంచనామాకు వెళ్లినా డబ్బులు అడుగుతున్నాడని ప్రజలు బహిరంగంగానే చెప్తున్నారు. ఈ అధికారి పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి అని పెట్టిన బోర్డు మాయం

ఈ భూమి ప్రభుత్వ భూమి అని అధికారులు సూచిక బోర్డు పెట్టినా అసైన్డ్ భూమిల్లో కబ్జాలు, విక్రయాలు ఆగడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఈ భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని సూచిక బోర్డు పెట్టిన కొద్ది రోజులకే అక్రమార్కులు ఆ బోర్డుని మాయం చేశారు. ఈ విషయం అధికారులకు తెలిసినా ఫిర్యాదు చేసినా చూస్తాం నిర్మాణాలు, విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్తున్నారు తప్ప ఆచరణలో కనిపించడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఫిర్యాదు వస్తేనే కొద్ది రోజులు హంగామా చేసి మళ్లీ చేతులు దులుపుకుంటున్నారుని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



ప్రభుత్వ భుముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములను కాపాడతాం. ఇప్పటికే అసైన్డ్ భూముల్లో చేపట్టిన నిర్మాణాలపై విచారణ జరుపుతున్నాం.

- వెంకటనర్సింహారెడ్డి, తహసీల్దార్, మూడుచింతలపల్లి

సంక్షిప్తంగా..

దివ్యాంగులకు ఉచిత వైద్యం

దుద్యాల: దివ్యాంగులు ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈఆర్‌పీ రామ్ శ్రీనివాస్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందించారు.

నెలాఖరునాటికి పన్నులు చెల్లిస్తే రాయితీ

పరిగి: 2025-26 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల ఇంటి పన్నులు చెల్లిస్తే ఐదుశాతం రాయితీ కల్పిస్తున్నామని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య శుక్రవారం వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించి తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంసాపత్రం

పరిగి: 2024-25 ఏడాదికిగా ఇంటిపన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో పరిగి మునిసిపాలిటీకి 27వ స్థానం లభించింది. జిల్లాలో రెండవ స్థానం లభించింది. ఈ సందర్భంగా మునిసిపల్ అథారిటి అడ్మినిస్ట్రేట్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవి చేతుల మీదుగా పరిగి మునిసిపల్ కమిషన్ వెంకటయ్య ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

పరిగి ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ డీఎం

పరిగి: ఆర్టీసీ పరిగి డిపో మేనేజర్ వైసుఖేందర్‌రెడ్డి శుక్రవారం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం, మొక్కను అందజేశారు.

ఈరమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కోట్‌పల్లి: మండల కేంద్రంలో శుక్రవారం ఈరమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఘట్‌కేసర్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్‌కేసర్ తహసీల్దార్ రజిని హెచ్చరించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 56లోని ప్రభుత్వ భూమిలో అధికారులు శుక్రవారం బోర్డు ఏర్పాటు చేశారు.

మహాసభ సన్నాహక సమావేశంలో పైలెట్

తాండూరు: బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హాజరయ్యారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

బొంరాస్‌పేట్: విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించడం హర్షణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని ఎన్కెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం దుస్తులు కుట్టేందుకు మహిళా సంఘాలకు వస్త్రాన్ని పంపిణీ చేశారు.

కులకచర్ల: ఎంఈవో కార్యాలయం నుంచి విద్యార్థుల దుస్తులు కుట్టేందుకు ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం మహిళా సంఘాలకు వస్త్రాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

దోమ: మండల కేంద్రంలో పాలమూర్ యూనివర్సిటీ విద్యార్థుల వేసవి శిబిరం కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజీరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

దోమ: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవీ ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

పూడూరు: అంగడి చిట్టెంపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జరీనాబేగం పాల్గొన్నారు.

విద్యార్థులకు అట్లాస్ పంపిణీ

పూడూరు: సోమన్‌గుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు అట్లాసు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

మూడుచింతలపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు శామీర్‌పేట్‌పోలీసులు తెలిపారు. ఏసీపీ రాములు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కీసర మండలం ధర్మవరం తోటకు చెందిన వరలక్ష్మి అనే వృద్ధురాలు తూంకుంట పరిధి దేవరాయంజల్‌లో తన పింఛన్ తీసుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు దొంగల మైసమ్మ వద్ద ఆటో కోసం వేచిచూస్తోంది. అంతలో పంది నరేష్ కుమార్ అనే వ్యక్తి వృద్ధురాలికి లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికి మార్గమధ్యలో ఓ వెంచర్‌లో బైక్ ఆపి ఫోన్ మాట్లాడుతుండగా అనుమానం వచ్చి వృద్ధురాలు అక్కడి నుండి వెళ్లిపోతుంది. అదే సమయంలో నరేష్ ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన శామీర్‌పేట్ పోలీసులు ఆరు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. 600 సీసీకెమెరాల ఫుటేజీలు పరిశీలించి నిందితుడి జాడను కనుగొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి చోరీ చేసిన రెండు తులాల పుస్తెలతాడు, ఒక సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నరేష్ వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ అని, జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడేవాడని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనాథ్, సీసీఎస్ సీఐ దళినాయుడు, ఏసీపీ శశాంక్ రెడ్డి, డీఐ గంగాధర్, ఎస్ఐలు హరిక, దశరథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్యకేసులో పురోగతి

పెద్దేముల్/బొంరాస్‌పేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండల కేంద్రంలో ఈనెల 2న హత్యకు గురైన మహిళ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. హత్యకు గురైన మహిళ ఎవరనే విషయాన్ని గుర్తించారు. ఎస్ఐ.శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్రాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లికి చెందిన యశోద కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. పదేళ్ల కిందట ఆమె భర్త మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు అశోక్‌కు వివాహం జరగగా బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో టీ కొట్టు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్న కుమారుడు అజయ్ సొంత గ్రామం చౌదర్‌పల్లిలో ఉంటూ కూలీ పనులతో జీవనం కొనసాగిస్తుంది. రోజు మాదిరిగా ఆమె పరిగి వెళ్లి కూలీ పనికి వెళ్లింది. ఒక్కోసారి రెండు మూడు రోజుల వరకు ఇంటికి రాకపోవడంతో ఉగాది తర్వాత వెళ్లిన యశోద ఇంటికి వస్తుందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సామాజిక మాధ్యమంలో హత్య విషయాన్ని తెలుసుకున్న కుమారుడు అజయ్ ఆమె చేతిపై ఉన్న పచ్చబొట్టు ద్వారా తన తల్లిగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం చౌదర్‌పల్లికి తీసుకొచ్చి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలి ఒంటిపై బంగారు పట్టీలు, కాళ్లకు వెండి కడియాలు, గొలుసు ఉండటంతో దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మహిళను హత్య చేసిన నిందితులను గుర్తించి పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవుశాపూర్‌కు చెందిన జిల్లాల యాది రెడ్డి(81) వీబీఐటీ కళాశాల సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదిరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళను కాపాడిన పోలీసులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో జాతీయ రహదారి పక్కన ఓ మహిళ మూర్ఛపోవడంతో గమనించిన స్థానికులు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమెను 108వాహనంలో కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహిళకు తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. మహిళను ఎవరైనా గుర్తిస్తే బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో ప్రతిభ

తాండూరురూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ సాధారణ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలో రాంపూర్‌మీదితండా విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. మండలంలోని రాంపూర్‌మీది తండాకు చెందిన విద్యార్థులు జినుగుర్తి సమీపంలోని ట్రైబుల్ గురుకులం, మరో ఇద్దరు విద్యార్థులు కొడంగల్ గురుకులంలో చేరేందుకు అర్హత సాధించి సీట్లు పొందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పరిగి: బసిరెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల నుంచి గురుకుల పాఠశాల ప్రవేశం కొరకు పది విద్యార్థులు పరీక్షలు గురుకుల ప్రవేశపరీక్ష రాశారు. వారిలో ఎనిమిది మంది విద్యార్థులు అవంతిక, మోక్ష, శ్రీదేవి, నవ్యశ్రీ, శ్రీనాథ్, శివప్రసాద్, లావణ్య, హర్షవర్ధన్‌లు అర్హత సాధించగా హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి,వసంత, కరుణాకర్‌రెడ్డిలు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కులకచర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ అన్వేష్‌రెడ్డి అన్నారు. స్థానిక చౌరస్తాలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పలు వాహనాలకు జరిమానాలు విధించారు.

దోమ: నంబరు ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని ఎస్ఐ నాగేందర్ తెలిపారు. బాసుపల్లి చౌరస్తాలో పోలీసు సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీ నిర్వహించారు.

తాండూరు: పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద శుక్రవారం ఎస్ఐ సంతోష్ కుమార్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్‌లులేని 50వాహనాలకు జరిమానా విధించారు. వాహన యజమానుల ద్వారా కొత్త నంబర్ ప్లేట్లు కొనుగోలు చేయించి అప్పటికప్పుడే ఏర్పాటు చేయించారు.

పూడూరు: మన్నెగూడలో నెంబర్‌ప్లేట్ లేని వాహనాలు తనిఖీ చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. మన్నెగూడ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేసి నెంబర్ ప్లేట్ లేని 12 బైకులు, 1 కారును సీజ్ చేసినట్లు తెలిపారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

పూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కంకల్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీను, సతీష్, ఏపీసీ కమిటీ చైర్మన్ ప్రమీల, రాజన్, విద్యార్థులు పాల్గొన్నారు.